
సాక్షి పల్నాడు

మంగళవారం । 18 । మార్చి । 2025



లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

క్రోసూరు: బయ్యవరం గ్రామంలో సోమవారం లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల ఘనంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బాల్య వివాహాలు నేరం

నరసరావుపేట రూరల్: బాల్య వివాహాలు నేరమని డీఆర్ఓ మురళి తెలిపారు. నీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
నరసరావుపేట	6.26	4.59
గుంటూరు	6.24	4.57
బాపట్ల	6.24	4.57

న్యూస్‌రీల్

వినుకొండలో వృద్ధురాలి హత్య

మెడలో బంగారు గొలుసు మాయం



మృతురాలు సావిత్రి(ఫైల్)

వినుకొండ: వినుకొండలో పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. కొత్తపేటలో నివాసం ఉంటున్న వృద్ధురాలు కొప్పరపు సావిత్రి(70)ని దుండగులు పట్టపగలే హత్య చేసి మెడలోని బంగారు గొలుసు చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ శోభన్‌బాబుతోపాటు పోలీసు సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బంగారు గొలుసు కోసమే హత్యచేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ ఇంటిలో లేకపోవటం గమనార్హం. పగలే హత్య చేసి టీవీ సౌండ్ ఎక్కువగా పెట్టి పరారయ్యారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వి.ఆంజనేయులు ఇంటికి కొద్దిదూరంలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డాగ్‌స్క్వాడ్ తో పరిశీలన అనంతరం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కేసును త్వరలోనే ఛేదిస్తామని సీఐ తెలిపారు.

వైద్యమిత్రల ధర్నా



నరసరావుపేట: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో గత 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా తమకు ఇప్పటికీ సరైన జీతాలు లేక తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వైద్యమిత్రలు విన్నవించారు. సోమవారం ప్రకాష్‌నగర్‌లోని ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం ముందు శాంతియుత నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. తాము ప్రతి నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఆస్పత్రికి, రోగులకు మధ్య అనుసంధాన కర్తలుగా వుంటూ పేద ప్రజలకు సేవలు అందజేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, తమ సర్వీసుని పరిగణనలోకి తీసుకొని ట్రస్ట్ ఉద్యోగిగా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ తరువాత కుటుంబానికి రూ.15లక్షల గ్రాడ్యూటీ ఇవ్వాలని, అంతర్గత ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

గోగులమ్మను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు (భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మను సోమవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఏటా ఫాల్గుణ నెలలో అమ్మ విగ్రహంపై కిరణాలు ప్రసరిస్తాయని అర్చకులు దీవి గోపి తెలిపారు. ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మత్స్యావతారంలో శ్రీవారు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి ఆస్థాన అలంకార ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన దూర్జటి మధుసూధనరావు, చెంచు వెంకట సుబ్బారావులు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన మిళ్లూరి రామచంద్ర శర్మ, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి నల్లపాటి రామారావు నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామం. ఇతని పేరు మీద తన సొంత గ్రామంలో 3.48 ఎకరాల పొలం ఉంది. రీ సర్వేలో 3.30 ఎకరాలు మాత్రమే నమోదైంది. దీనిపై పల్నాడు జిల్లా కలెక్టర్‌ని కలసి రెండు సార్లు అర్జీలు ఇచ్చాడు. చివరికి రెండు నెలల క్రితం సర్వేయర్ వచ్చి పొలం కొలిచినప్పటికీ ఇప్పటికీ సర్వే సర్టిఫికెట్ ఇవ్వలేదని ఫిర్యాదుదారుడు వాపోతున్నాడు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు క్యూ కడుతున్న అర్జీదారులు
- గత పది నెలల్లో కలెక్టరేట్‌లో సుమారు 500 అర్జీలు రీ ఓపెన్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పదేపదే వెళ్లినా తీరని సమస్యలు
- గత ప్రభుత్వం హయాంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక కాల్ సెంటర్
- సమస్య పరిష్కారం అయ్యేవరకు పర్యవేక్షణ
- నేడు కలెక్టర్ చెప్పినా కింద స్థాయిలో పట్టించుకోవడం లేదని వాపోతున్న ఫిర్యాదుదారులు

రీవెన్స్!

గ్రీవెన్స్‌లో రీ ఓపెన్ అవుతున్న అర్జీలు



ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన అల్లూరివారి పాలెం, ఎస్టీకాలనీ వాసులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన వారికి సత్వరమే న్యాయం చేయకపోగా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు తమ గోడును విన్నివించుకోని రోజుతో వెళ్లిన వారికి రిక్తహస్తమే దక్కుతోంది. ఫిర్యాదుకు నిర్ణయించిన గడువులోగా పరిష్కారం చూపకపోవడంతో ఫిర్యా దులు రీ ఓపెన్ అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఏడాది జూన్ 15వ తేదీ నుంచి ఇప్పటివరకు కలెక్టరేట్‌లో 13,695 ఫిర్యాదుల అందగా వాటిలో 12,277 ఫిర్యాదులు పరిష్కారం చూపగా, 1,418 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు 500 ఫిర్యాదుల రీ ఓపెన్ అయ్యాయి. ఇందులో అత్యధికంగా రెవె న్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల రీ ఓపెన్ అవుతున్నాయి. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగివేసారి కలెక్టర్ కార్యాలయానికి వచ్చినా సత్వరం న్యాయం జరగడంలేదని బాధితులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మాదిరి స్పందన ఉండటం లేదని వాపోతున్నారు.

గతంలో సత్వర పరిష్కారం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ద్వారా స్పందన ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించేవారు. ఇందులో పనిచేసే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారుడు, సంబంధిత అధికారులు, ఆయా మండలాల ప్రత్యేక అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేవరకు పనిచేసేవారు. దీనివల్ల ఫిర్యాదుదారులకు సత్వరమే సమస్య పరిష్కారం, లేదా కాకపోవడానికి గల కారణాలు తెలిసేవి. కొత్త ప్రభుత్వం వచ్చాక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు స్వస్తిపలికారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ సిబ్బంది, ప్రత్యేకాధికారులు ఈ పనిచేస్తున్నా గతంలో లాగా పారదర్శకత ఉండటం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశించినా కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులు కొన్ని..



సమస్యపై కలెక్టర్‌కు మళ్లీ అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు వినుకొండ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ప్రజాసంఘాల వారు. గ్రామం నుంచి వితంరాజుపల్లి శివారు చెక్కవాగు వరకు ఉన్న ఎన్ఎస్పీ మైనర్ ఇరిగేషన్ కాలువ చెట్లు, కంపతో నిండిపోయి, ఖాళీ కూడా లేదంటూ.. కాల్వలో అక్కడక్కడ గండ్లు పడి నీళ్లు పొలాల్లోకి, ఇళ్లల్లోకి వెళ్తున్న అధ్వాన పరిస్థితిని చక్కదిద్దాలంటూ గత ఆరు నెలలుగా క్రమం తప్పకుండా కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సోమవారం ఇదే

ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు..



మేము 54 మందిమి గత ఐదేళ్లుగా మున్సిపాల్టీలోని పారిశుద్ధ్య విభాగంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నాం. మాకు అరకొర జీతాలే చెల్లిస్తున్నారు. మొదట మున్సిపల్ శాఖ నుంచి, ఆ తర్వాత ఆప్కాస్ ద్వారా చెల్లిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐలు కట్ చేస్తున్నారు. వాటికి కార్డు ఇవ్వలేదు. మాకు ఒక్కో నెల ఒక్కోరకంగా జీతం ఇస్తున్నారు. పూర్తి నెల జీతం అందించడం లేదు. మున్సిపల్ ఉద్యోగులనే కారణంతో సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. ఎన్నోసార్లు వినతి పత్రాలు, అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. రెగ్యులర్ కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి, నెలకు రూ.21వేలు వేతనం చెల్లించాలి.

– కార్మికులు, నాయకులు, పల్నాడు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

వెల్ఫేర్ సెక్రటరీగా ఉద్యోగం ఇప్పించండి



నేను బీకాం చదివాను. కూలి పనిచేసుకుంటున్నా. సచివాలయ వార్డు సెక్రటరీల ఉద్యోగాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసి ఎంపికయ్యాను. తీరా బీకాం చదివిన వారు అనర్హులని అప్పుడు ఉద్యోగం ఇవ్వలేదు. నేను నా కుటుంబంతో పాటు పనికోసం హైదరాబాదు వెళ్లాను. నాతో పాటు పరీక్షరాసి ఎంపికైన వారు కోర్టుకు వెళ్లటంతో ప్రభుత్వ ఆదేశాలపై కోర్టు స్టే ఇచ్చింది. దీంతో కొంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు. నాకు ఆలస్యంగా ఈ విషయం తెలిసింది. కాబట్టి విచారించి నాకు కూడా వార్డు వెల్ఫేర్ సెక్రటరీగా ఉద్యోగం ఇప్పించాలని కోరుతున్నా.

– పాముల నరేష్, పిడుగురాళ్ల

మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదు



నరసరావుపేటలో చాలా మద్యం దుకాణాలు ఉదయం 6 గంటల నుంచే షాపులు తెరిచి మద్యం విక్రయాలు చేస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత కూడా అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసంలో ఇబ్బందికరంగా ఉంది. పట్టణంలో ప్రముఖ మసీదుల వద్ద ఉన్న మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద మరీ ఇబ్బందికరంగా మారింది.. అలాగే ఈద్గా మైదానంలో రాత్రిళ్లు మద్యం సేవిస్తున్నారు. ఎక్సైజ్ విభాగం చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వండి.

– షేక్ కరిముల్లా, ఎంఐఎం జిల్లా కార్యదర్శి

మాకు పట్టాలు మంజూరు చేయండి

మా పూర్వీకులు, మేము 50 ఏళ్ల నుంచి గ్రామంలో నివాసం ఉంటున్నాం. మా పూర్వీకులకు ప్రభుత్వం ఇంటిస్థలం మంజూరు చేసింది. ఆ స్థలంలో కోర్టు ఆదేశాల మేరకు ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నాం. కమ్యూనిటీ హాలుకు సైతం స్థలం కేటాయించారు. అయితే 10 ఏళ్ల క్రితం మా కాలనీలోని వేరే ఖాళీ స్థలంలో ప్రభుత్వం కమ్యూనిటీ హాలు నిర్మించింది. గతంలో కమ్యూనిటీ హాలుకు కేటాయించిన స్థలం ఖాళీగా ఉంది, ఆ స్థలానికి పట్టాలు మంజూరు చేయండి.

– ఎస్టీకాలనీ వాసులు, అల్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

దస్తావేజులు ఇప్పించండి



మేము నలుగురం అన్నదమ్ములం. అందరికీ వివాహాలు అయ్యాయి. అందరికీ పిల్లలు ఉన్నారు. మాలో ఇద్దరు చనిపోయారు. అందరమూ బతికి ఉండగానే సత్తెనపల్లి, చిలకలూరిపేట, పెదమక్కెన తదితర ప్రదేశాల్లో పొలం, ఇళ్ల స్థలాలు కొన్నాం. అయితే నాకెటువంటి ఆస్తి ఇవ్వకుండానే మిగతా ముగ్గురూ దస్తావేజులతో పాటు ఆస్తికూడా వారికిందనే ఉంచుకున్నారు. ఇప్పుడు పిల్లలు అందరూ పెద్దవారయ్యారు. భవిష్యత్‌లో పిల్లల మధ్య ఆస్తి విషయమై ఎటువంటి వివాదాలు జరగకుండా ఉండేందుకు గాను నలుగురికి సమానంగా ఆస్తిపంపకం చేసి ఎవరి దస్తావేజులు వారికి ఇప్పించండి.

– మంచి వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి

జూన్ 15 నుంచి అందిన ఫిర్యాదులు : 13,695

పెండింగ్:	రీ ఓపెన్ :
1418	500

పరిష్కారమైనట్లు చెబుతున్నవి : 12,277

కత్తవ కాలువపై ఆక్రమణలు తొలగించండి



సత్తెనపల్లిరోడ్డులోని అవులసత్రం పక్కనే ఉన్న కత్తవ కాలువను కొంతమంది ఆక్రమించి షెడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారు. దీని వలన ముంపు నీరు ప్రవహించే మార్గంలేక పట్టణం కొంతమేర ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆ నిర్మాణాలు తొలగించి కాలువను పునరుద్ధరించాలి. అధికారులు పట్టించుకోవడం లేదు.

– జి.రామకృష్ణ, షేక్.మస్తాన్‌వలి, ప్రజాసంఘాల నాయకులు

జననేతకు జేజేలు



పెళ్లి రిసెప్షన్‌కు హాజరైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న ప్రజలు

- తెనాలిలో అడుగడుగునా నీరాజనం
- మాజీ ఎమ్మెల్యే శివకుమార్ కుమారుడి పెళ్లి రిసెప్షన్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్
- వధూవరులకు ఆశీర్వచనం

తెనాలి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్పశ్రీల పెద్ద కుమారుడు సత్యనారాయణ చౌదరి, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు మనవరాలు, మాదల రాజేంద్ర-పద్మినీదేవి కుమార్తె మధువంతి వివాహ రిసెప్షన్ కోసం సోమవారం రాత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి వచ్చారు. రోడ్డు మార్గాన విజయవాడ నుంచి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ-తెనాలి రోడ్డులోని రూరల్ మండల గ్రామం నందివెలుగుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచిఉన్న ప్రజలు, అభిమానులు కాన్వాయ్ ఎదుట పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అక్కడి నుంచి అడుగడుగునా నీరాజనాలు పట్టారు. వేలాది ద్విచక్రవాహనాల్లో కార్యకర్తలు, అభిమానులు కాన్వాయ్‌కు ముందు ఊరేగింపుగా కదిలారు. ఊరివెలుపల వీఎస్సార్ కాలేజీకి చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ముందు బాణసంచా కాల్చారు. అక్కడి నుంచి ప్రతి కూడలిలోనూ తమ ప్రియతమ నేతను చూసేందుకు ప్రజలు వేచి ఉన్నారు. కారులో అభివాదం చేస్తూ కనిపించిన జననేతను చూసి కేరింతలు కొట్టారు. పలుచోట్ల జగన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తూ కనిపించారు. వేలాది వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. నందివెలుగు నుంచి దాదాపు పది కిలోమీటర్లలోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలోని పెళ్లి రిసెప్షన్ వేదికకు చేరుకునేందుకు రెండు గంటల సమయం పట్టింది. అక్కడ కిక్కిరిసిన జనసందోహానికి అభివాదం చేసుకుంటూ వైఎస్ జగన్ వేదికపైకి చేరుకున్నారు. సీఎం, సీఎం అంటూ జగన్నినాదాలు మిన్నంటాయి. అభిమానులు వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నూతన వధూవరులు సత్యనారాయణచౌదరి- మధువంతిని ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు, మాదల రాజేంద్ర దంపతులను పలకరించారు. వేలాదిగా హాజరైన ప్రజలకు అభివాదం చేశారు. 8.25 గంటలకు తిరిగి బయలుదేరి వెళ్లారు. మాజీ సీఎం పర్యటనలో పోలీసులు కనీస బందోబస్తు ఏర్పాట్లు చేయలేదు. ఎప్పటిలా ఉండే ట్రాఫిక్ పోలీసులు, కాన్వాయ్ ముందు వాహనంలో పర్యటించిన పోలీస్ అధికారులు మినహా పోలీస్ సిబ్బంది కనిపించలేదు. ప్రతిచోటా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. కార్యకర్తలు, మాజీ సీఎంతో ఉన్న సెక్యూరిటీ వాళ్లే రోడ్డు క్లియర్ చేసుకుంటూ కాన్వాయ్ ముందుకు కదిలేలా చూశారు.

సెంటు భూమిలోని పంట కూడా ఎండకూడదు

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి సాగునీరు అందని కారణంగా సెంటు భూమిలో పంట సైతం ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలో రైతుల అవసరాలకు తగ్గట్టు నీరుఅందేలా చూడాలన్నారు. మండలస్థాయిలో కరవు పర్యవేక్షణ సెల్ ప్రారంభించాలన్నారు. పంచాయతీ నిధులతో గ్రామాల్లో తాగునీటి సరఫరా చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సందర్శకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో పీ-4 సర్వే 95 శాతం, వర్క్ ఫ్రం హోం 45 శాతం పూర్తయ్యాయన్నారు. జిల్లా ప్రజల చేత అభివృద్ధికి సూచనలు చేసే పీ-4 కన్సల్టెన్సీ సర్వేలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. మార్చి నెలాఖరులోగా రైతు రిజిస్ట్రేషన్లు 60 శాతం పూర్తిచేయాలన్నారు. ఫామ్‌పాండ్స్ పథకంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం మూడు ఫామ్‌పాండ్స్ ప్రారంభించేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల కోసం ఆర్థికసాయం పెంపు విషయంపై లబ్ధిదారులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో పేదలకు 365 రోజుల ఉపాధి కల్పించాలన్నారు. కాగా, కందిపప్పు, శనగ కొనుగోలు కోసం రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జేసీ సూరజ్ గనోరే ఆదేశించారు. డీఆర్వో ఎ.మురళి, సీపీఓ జి.శ్రీనివాస్, డీపీఓ విజయభాస్కరరెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) విధానంలో పల్నాడు జిల్లాలోని రైతులందరూ పంటలను సాగు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కషాయాలు, తెగుళ్లు, పెరటి తోటల పెంపకం, పుస్తకాలు, పాంప్లెట్స్ ఆవిష్కరించి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు, పురుగుమందుల వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తయారైన ఉత్పత్తులను తినడం ద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. జిల్లా అధికారులందరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. డీపీఓ పి.అమలకుమారి మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డీఎఫ్ఓ కృష్ణప్రియ, డీఆర్ఓ మురళి, డీఏఓ ఐ.మురళి, స్టేట్ ఎన్ఎఫ్ఏ మన్విత, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మేరీ, సౌజన్య, బేబీ రాణి, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

- జిల్లాలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న పేద, అర్హులైన 17 మంది దివ్యాంగులైన విద్యార్థులకు ఏపీ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ సహాయక సంస్థ ద్వారా ఉచితంగా ల్యాప్ టాప్‌లను కలెక్టర్ పి.అరుణ్‌బాబు అందజేశారు.

పది పరీక్షలు ప్రారంభం

- జిల్లాలో 128 పరీక్ష కేంద్రాలు
- తెలుగు పరీక్షకు 99.5శాతం హాజరు
- 72 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన 6 స్క్వాడ్ బృందాలు



మున్సిపల్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద వేచియున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పల్నాడుజిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 128 పరీక్ష కేంద్రాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 26,497మంది విద్యార్థులకు గాను 99.5శాతం హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రికార్డు స్థాయిలో 72 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. అలాగే డీఈఓ ఎల్.చంద్రకళ పట్టణంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాలను సందర్శించి సీఎస్‌లకు పలు సూచనలు చేశారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదవ తరగతి దూరవిద్య పరీక్షలకు జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాలలో తొలిరోజు నాలుగు కేంద్రాలలో నిర్వహించిన హిందీ పరీక్షకు నలుగురు విద్యార్థులకు గాను ఇద్దరు హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరీక్షల పరిశీలకులు ఎన్.గీత పట్టణంలోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రోసూరు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

బేస్‌బాల్‌లో ఆంధ్రజట్టుకు ఎంపికైన విద్యార్థులు



క్రోసూరు: పంజాబ్ రాష్ట్రం సంగ్రూరులో మార్చి 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే సబ్ జూనియర్ బేస్‌బాల్ నేషనల్ టోర్నమెంట్‌కు క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత సోమవారం తెలిపారు. ఎంపిక వివరాలు తెలుపుతూ ఆదివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం, కసుమూరులో బేస్‌బాల్ రాష్ట్ర జట్టును ఎంపిక చేశాన్నారు. అందులో క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఎనిమిదవ తరగతికి చెందిన వి.గ్రీష్మ బిందు, ఎం.గాయత్రి, అదేవిధంగా ఏడవ తరగతికి చెందిన కె.జాషువా డేనియల్, ఎస్కే అబుబకర్ లను ఆంధ్ర జట్టుకి ఎంపిక చేసినట్లు చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు నేషనల్ టోర్నమెంట్‌కు ఎంపికవడంపై ఎంతో సంతోషంగా ఉందని, ఆంధ్రజట్టు తరపున పోటీల్లో గెలిచి తమ పాఠశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

సత్తెనపల్లి: గుర్తు తెలియని మృతదేహం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నిర్మల నగర్ సమీపంలో గల రైల్వే పట్టాలపై సోమవారం కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నిర్మలా నగర్ రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం రైల్వే పట్టాలపై పడి ఉంది. మృతదేహం పూర్తిగా ఛిద్రమై ఉండడంతో గుర్తుపట్టడం అసాధ్యంగా మారింది.

కొడుకులు అడుక్కుతినమంటున్నారు!

- జిల్లా ఎస్పీ ఎదుట వాపోయిన ఓ వృద్ధ తండ్రి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 75 ఫిర్యాదులు స్వీకరణ



నరసరావుపేట రూరల్: 'అయ్యా.. నాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నా స్వశక్తితో సంపాదించిన రెండు ఇళ్లను కొడుకులకు ఇచ్చాను. ఇప్పుడు నేను పక్షవాతంతో పాటు షుగర్, బీపీతో అనారోగ్యానికి గురికావడంతో ఇద్దరు కుమారులూ పట్టించుకోవడం లేదు. పనిచేసే ఓపిక ఉన్న నా భార్యను మాత్రం చిన్న కుమారుడు తన వద్ద ఉంచుకుని దుకాణంలో పని చేయించుకుంటున్నాడు. నేను ఎలా బతకాలని అడిగితే అడుక్కుతినమంటూ కొడుకులు సలహా ఇస్తున్నారు. ఏ పని చేయలేని స్థితిలో ఉన్న నాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాను.

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాచర్లకు చెందిన వృద్ధుడైన ఏడుకొండలు ఆవేదన ఇది.. ఇదేవిధమైన పలు అర్జీలు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చాయి. పరిశీలించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అర్జీలపై సత్వరం చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక, కుటుంబ, ఆస్తి తగదాలకు సంబంధించి 75 ఫిర్యాదులు అందాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

కన్న కూతురు మోసం చేసింది..



నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉద్యోగరీత్యా కుమారుడు, కోడలు నిజామాబాద్‌లో ఉంటున్నారు. కుమారుడు నాతో పాటు నా భర్త చిన్నయ్య బాగోగులు చూసేవాడు. కోవిడ్ సమయంలో రెండు నెలలు మా వద్దకు రావడానికి కుమారుడికి వీలుకాలేదు. ఆ సమయంలో నా భర్త అనారోగ్యానికి గురికావడంతో గ్రామంలోనే నివసించే మా కుమార్తె శాంతకుమారి తన ఇంటికి తీసుకెళ్లింది. ఆ సమయంలో నా భర్త పేరున ఉన్న రూ.6లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ నగదును డ్రా చేయడంతో పాటు పూర్వార్జితంగా వస్తున్న 1.40 ఎకరాలను తనకు గిఫ్ట్‌గా ఇచ్చినట్టుగా రాయించుకుంది. తదనంతరం నా భర్త చనిపోవడంతో ఇప్పుడు నన్ను పట్టించుకోవడం లేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ నగదును నాకు అందించేలా చర్యలు తీసుకోండి.

– పి.చిన్నమ్మ, ముసాపురం, పెదకూరపాడు మండలం

రెండుసార్లు హత్యాయత్నం చేశారు

సత్తెనపల్లిలోని పెద్దమసీదు ప్రాంతంలో నివసించే నాపై గత ఏడాది ఎన్నికల ముందు దాడి జరిగింది. 15 రోజులు ఐసీయూలో చికిత్స పొందాను. నాలుగు నెలల క్రితం మరోమారు హత్యాయత్నం చేశారు. షాదీఖానా బజార్‌లో తల్వార్‌తో దాడికి పాల్పడ్డారు. షేక్ ఆదం షరీఫ్ అతని కుమారులు గౌస్, రఫీలతో పాటు ఉమర్, అక్తాబ్ ఈ దాడిలో పాల్గొన్నారు. సత్తెనపల్లి టౌన్ పీఎస్‌లో వీరిపై ఫిర్యాదు చేశాను. ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోలేదు. నాపై కౌంటర్ కేసులను పోలీసులు నమోదు చేసారు. నిందితులు ఇప్పటికీ తల్వార్లతో తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.



– షేక్ రఫీ, సత్తెనపల్లి

హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి



మా అమ్మ ఆరే లక్ష్మమ్మ కారంపూడిలో నివసిస్తుంది. గత ఏడాది మార్చి 27వ తేదీన ఆమెను హత్య చేశారు. ఈ కేసులో అనుమానితులుగా ఆరే రమేష్, ఆరే రాంబాబు, పులి శ్రీలక్ష్మి, ఆరే పద్మల పేర్లను పోలీసులకు మేం అందజేశాం. ఆస్తి కోసం గతంలో వీరు ఆమెను చంపటానికి ప్రయత్నించారు. ఇప్పటివరకు ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేయలేదు. స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకే పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయం చేయాలి.

– తాళ్ల పద్మ, అడిగొప్పుల, దుర్గిమండలం

రేపు పిడుగురాళ్లలో జాబ్ మేళా

పిడుగురాళ్ల: 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్' ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ జాబ్ మేళాలో పలు కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అపోలో ఫార్మసీ, లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ పేమెంట్స్, ముత్తూట్ ఫైనాన్స్, రుద్ర కార్పొరేషన్ సర్వీస్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి రూ.11,500 నుంచి రూ.35వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌కు 10వ తరతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ మరియు పీజీ విభాగాల వారు అర్హులేనని, అంతేకాకుండా 18 నుంచి 40 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 19వ తేదీ పిడుగురాళ్ల గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించటం జరుగుతుందన్నారు. వివరాలకు పి.శ్రీకాంత్ 9492158153, నావికా నాయక్ 9010585360 నెంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ బదిలీలకు నిరసనగా ఎన్‌ఎస్పీ ఉద్యోగుల ఆందోళన



ఎన్‌ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

నరసరావుపేట: ఎన్‌ఎస్పీ అధికారులైన సూపరింటెండెంట్ ఇంజినీరు కృష్ణమోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారావుల వేధింపులపై ఉద్యోగులు సోమవారం ఆందోళనకు దిగారు. ఎన్‌ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వర్క్‌చార్జ్‌డ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే వద్ద నుంచి లెటర్ తీసుకొచ్చి రాష్ట్ర నాయకత్వంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేస్తున్న నాగరాజు, కొండారెడ్డిలపై అభియోగాలు మోపుతూ ఇక్కడి నుంచి మాచర్లకు బదిలీ చేశారన్నారు. ఎటువంటి విచారణ లేకుండా అకస్మాత్తుగా బదిలీ చేయటంపై న్యాయ విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలని తాము రావటం జరిగిందన్నారు. సమర్థవంతంగా పనిచేసి అవార్డులు పొందిన చరిత్ర యూనియన్ నేతలకు ఉందని, కేవలం నాలుగైదు నెలల క్రితం అధికారులుగా వచ్చిన వారికి వీరి సమర్థత ఏవిధంగా తెలుస్తుందని ప్రశ్నించారు. సాగర్ పరిధిలో సరైన ఏఈలు లేకపోయినా లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తూ ప్రతి ఎకరాకు నీరు అందేలా పనిచేస్తున్నారన్నారు. డీఈ, ఈఈలను మారుస్తారా, లేక తమ 60మంది ఉద్యోగులను మారుస్తారా అనేది తేల్చుకోవాలన్నారు. వీరిపై సీఈచే విచారణ చేస్తున్నారని తెలిసిందని, ఆ విచారణ ముగిసేంతవరకు బదిలీ రద్దుచేయాలని కోరారు. బదిలీ ఉపసహరించేంతవరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని బిస్మిల్లా హోటల్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం... గత 5 రోజుల నుంచి ఓ వ్యక్తి మంగళగిరి పాతబస్టాండ్ సమీపంలో వున్న బిస్మిల్లా హోటల్ దగ్గర ఉంటున్నాడు. అతని ఆరోగ్యం సరిగా లేదని, కొన్ని రోజులుగా భోజనం, తాగునీరు అందజేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆ వ్యక్తి మృతి చెందాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ దోహదం

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రతీ ఒక్క మహిళ శక్తియాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయానికి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు విచ్చేసిన మహిళలకు యాప్ వివరాల కరపత్రాలు పంచి వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం శక్తి పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, లైంగికదాడులు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పల్నాడు జిల్లాలో మహిళలు, గృహిణులు, విద్యార్థినులు వారి ఫోన్లులో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని కోరారు. అదనపు ఎస్పీ (పరిపాలన) జేవీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకట రమణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ, మహిళలు

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం పెన్షనర్లకు ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అన్నిరకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెన్షనర్స్ భవనంలో నందా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు కొన్ని సంవత్సరాల నుంచి డీఏ, పీఆర్‌సీ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, అవి పొందకుండానే అనేకమంది పెన్షనర్లు చనిపోతున్నారని, అసలే ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్న పెన్షనర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నరసింహయ్య మాట్లాడుతూ పెన్షనర్లు ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా పొందే ఉచిత వైద్య సౌకర్యాన్ని కార్పొరేట్ హాస్పిటళ్లు నిర్లక్ష్యం చేస్తున్నాయని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని కార్డుల ద్వారా ఉచిత వైద్య సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు హరినాథబాబు, సీతారామయ్య, అంజయ్య, నాసరయ్య, సుబ్బారావు, చంద్రయ్య, గాలీబ్, గౌస్ మొహిద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి సిబ్బంది పెన్షనర్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

లంక పొలాల సమస్య పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: కుంచనపల్లిలోని దళిత లంక పొలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాచైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడారు. కృష్ణానది ఒడ్డున దళితులకు ఇచ్చిన 30 ఎకరాల లంక పొలాల సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సాగు చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, నాయకులు నాగపోగు విజయరాజు, అమ్మిశెట్టి రామారావు, కంచర్ల సాంబశివరావు, కొండపల్లి యశోద, సింగంశెట్టి రవికిషోర్, అమ్మిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నేతాజీ

కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఎమ్మార్పీ పాటించని కూల్‌డ్రింక్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిల్లి యజ్ఞనారాయణ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 100 ఎం.ఎల్ కూల్‌డ్రింక్ సీసాపై రూ.10 ఉంటే దానిని రూ.15కు, 200 ఎం.ఎల్ పెట్ బాటిల్‌పై రూ.20 ఉంటే దానిని రూ.25లకు అమ్ముతున్నారని అన్నారు. చిరుతిళ్ల ప్యాకెట్స్‌పై గడువు ముగింపు తేదీని తొలగించి అమ్ముతున్నారని, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో రంగులు, రసాయనాలు, టేస్టింగ్ సాల్ట్ వాడి ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. తరచుగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలో సోమవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రెంటచింతల గ్రామానికి చెందిన మక్కెన శివతేజ(30) పేరేచర్లలో కొబ్బరి బొండాల దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పేరేచర్ల నుంచి రెంటచింతలకు స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో పిడుగురాళ్ల పట్టణంలోని కొండమోడు సమీపంలో శ్రీ లక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్, ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో లారీ అతివేగంగా వచ్చి శివతేజ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో రోడ్డుపై పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్ తెలిపారు.



మృతి చెందిన మక్కెన శివతేజ

మహిళా చైన్ స్నాచర్ అరెస్ట్

42 గ్రాముల బంగారం స్వాధీనం

మంగళగిరి టౌన్: ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ మహిళను మంగళగిరి పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి పట్టణ ఎస్‌ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల మేరకు... పాత మంగళగిరికి చెందిన రామిశెట్టి సాయిలక్ష్మి నివాసానికి అద్దెకు ఇల్లు కావాలంటూ ఓ మహిళ వచ్చింది. మాట కలిపాక ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని బయటకు పరిగెత్తింది. సాయిలక్ష్మి పెద్దగా కేకలు వేయడంతో ఆ మహిళ చైన్‌ను అక్కడ వదిలేసి పారిపోయింది. సోమవారం మంగళగిరి రత్నాలచెరువు అండర్‌పాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా విజయవాడకు చెందిన మానసవాణి అని, గతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చైన్ స్నాచింగ్ కేసుకు సంబంధించి 42 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మానసవాణిపై విజయవాడలో సింగ్‌నగర్, కృష్ణలంకలో రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయని విచారణలో తెలిసినట్లు తెలిపారు. మానసవాణిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రవీంద్రనాయక్ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న మంగళగిరి పట్టణ ఎస్‌ఐ రవీంద్రనాయక్